క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కందనూలు: బెస్ట్ అవేలబుల్ పాఠశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి 3వ, 5వ, 8వ తరగతి ప్రవేశాల కోసం జిల్లాలోని ఎస్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల వారు రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల వారు రూ.1.50లక్షల లోపు ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారములు జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయం మన్ననూర్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 17వ తేదీలోపు కలెక్టరేట్ బిల్డింగ్ రూం నంబర్ ఎఫ్ 27లో అందజేయాలని కోరారు.

గోవులను రక్షించాలని డీఎస్పీకి వినతి



అచ్చంపేట రూరల్: గోవుల రక్షించాలని కోరుతూ భజరంగ్‌దళ్ అచ్చంపేట ప్రఖండ సంయోజక్ శివచంద్ర శుక్రవారం డీఎస్పీ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివచంద్ర మాట్లాడుతూ గోవధ కారణంగా సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందన్నారు. గోవులను అక్రమంగా తరలించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివాజీ, నరేష్, చందులాల్ చౌహాన్, అమర్, అజయ్, చైతన్యచారి, బాలకోటి పాల్గొన్నారు.

అమ్రాబాద్ ఎంపీడీఓగా లింగయ్య



మన్ననూర్: అమ్రాబాద్ మండల అభివృద్ధి అధికారిగా ఎం. లింగయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పెద్దకొత్తపల్లి మండలంలో ఎంపీఓగా విధులు నిర్వర్తిస్తూ డిప్యూటేషన్‌పై అమ్రాబాద్ మండల ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా మండల అధికారులు, నాయకులు ప్రజలు ఎంపీడీఓకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

ఆర్థికసాయం అందజేత



ఉప్పునుంతల: మండల కేంద్రానికి చెందిన విద్యార్థి మేడమోని భాను ప్రసాద్‌కు శుక్రవారం మండల యువజన కాంగ్రెస్ నాయకులు రూ.15 వేలు ఆర్థికసాయం అందించారు. విద్యార్థి స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతి చదివి 500ల పై చిలుకు మార్కులు సాధించడంపై వారు అభినందించారు. ప్రస్తుతం కళాశాలలో ఇంటర్ చదువుకోవడానికి పేపర్ బాయ్‌గా పనిచేస్తూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు మేడమోని భాస్కర్, నాయకులు రేణయ్య, కృష్ణ, లక్ష్మయ్య, మహేష్, నరేష్‌యాదవ్, శ్రీశైలం యాదవ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు నిలపాలి



అచ్చంపేట రూరల్: బల్మూర్ మండలం జినుకుంట కనకాల మైసమ్మ దేవాలయం గేటు వద్ద ఆర్టీసీ బస్సులు నిలపాలని పలువురు భక్తులు కోరారు. శుక్రవారం అచ్చంపేట ఆర్టీసీ డిపోలోని అధికారులకు భక్తులు, ప్రయాణికులు వినతిపత్రం అందజేశారు. తుమ్మెన్‌పేట గేటు వద్ద బస్సులు నిలపడంతో దేవాలయానికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. దేవాలయం సమీపంలో బస్సు నిలపాలని కోరారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం



తెలకపల్లి: హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కేశవులు గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గౌరెడ్డిపల్లిలో ఆ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నిరంతరం ప్రజా సమస్యలపై ప్రజలకోసం పోరాడుతామన్నారు. అనంతరం మహాసభ కమిటీని ఎన్నుకున్నారు.



వెల్దండ బడిబాట కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఈఓ రమేష్‌కుమార్



బిజినేపల్లి మండలం కారుకొండలో



తెలకపల్లిలో ..

పాఠశాలల బలోపేతమే లక్ష్యం

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కేంద్రంలో క్యాంపు కార్యాలయంలో బడిబాట కరపత్రాన్ని ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో యంగ్ ఇండియా పాఠశాలను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. వెల్దండ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభకు డీఈఓ రమేష్‌కుమార్ హాజరై మాట్లాడారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంపై ఉపాధ్యాయులతో డీఈఓ రమేష్ కుమార్ సమావేశం అయ్యారు. ఈ నెల 19వ తేదీ వరకు బడిబాట కొనసాగుతుందన్నారు. అనంతరం బడిబాట కార్యక్రమంపై ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించి, బడిబాట కార్యక్రమ కరపత్రాలను డీఈఓ విడుదల చేశారు. బిజినేపల్లి మండలంలోని కారుకొండ ప్రాథమికోన్నత పాఠశాల ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేసి బడిబాట నిర్వహించారు. కొల్లాపూర్ మండలంలో విద్యార్థుల తల్లిదండ్రులతో



నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

సమావేశం అయ్యారు. పెద్దకొత్తపల్లిలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి గ్రామ పంచాయితీ వద్ద విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. చారకొండ మండల కేంద్రంతో పాటు మండలంలోని జూపల్లిలో బడిబాటలో ఎంఈఓ ఝాన్సి రాణి హాజరయ్యారు. ఉప్పునుంతలలో గ్రామస్తులు ఉపాధ్యాయులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కల్వకుర్తి మండలం కురుమిద్ద తండాలో నిర్వహించిన బడిబాటలో ఎంఈఓ హాజరయ్యారు. తెలకపల్లి, అమ్రాబాద్ మండలం మాచారం, లింగాలలో బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష కో–ఆర్డినేటర్ వెంకటయ్య, టె స్ట్‌బుక్ మేనేజర్ నరసింహులు, ఎంఈఓలు శంకర్ నాయక్, చంద్రుడు నాయక్, శ్రీనివాసురెడ్డి, బషీర్ అహ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

అచ్చంపేట రూరల్: పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లను అందజేశారు. అచ్చంపేట మండలంలోని వివిధ గ్రామాలు, పట్టణంలోని పలు కాలనీలకు చెందిన అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లను పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులకు రాజీవ్ యువవికాసం ద్వారా రుణాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, కమిషనర్ యాదయ్య, ఎంపీడీఓ మధుసూదన్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

వంగూరు: మండలంలోని ఉల్పరలో ఇటీవల అనారోగ్యానికి గురై మృతిచెందిన ఐఎస్టీయూసీ మండలాధ్యక్షులు మల్లయ్య కుటుంబసభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పరామర్శించి రూ.70వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా పోల్కంపల్లి గ్రామానికి చెందిన చాకలి బౌరమ్మ ఇటీవలే మృతిచెందింది. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అదేవిధంగా మిట్టసదగోడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాండురంగారెడ్డి అనారోగ్యానికి గురై హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో గ్రామంలో ఉన్న ఆయన తల్లిదండ్రులను ఎమ్మెల్యే కలిసి ధైర్యంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అల్వాల్‌రెడ్డి, రమేష్‌గౌడ్, హరీష్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, శంకర్, పాండు తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేటలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

భక్తిభావంతో ప్రశాంతత



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ: భక్తిభావంతో ప్రశాంతత కలుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వీరనాగమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. గౌడ కులస్తులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేసి నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, విజేందర్‌గౌడ్, మోతీలాల్‌నాయక్, పర్వత్‌రెడ్డి, నాయకులు, గౌడ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలో ఇంటింటికి తిరిగి చెత్త సేకరణ పక్కాగా చేపట్టాలని సీడీఎంఏ అసిస్టెంట్ డైరెక్టర్ సాయి సూచించారు. శుక్రవారం 100 రోజుల ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలోని ఇంటింటికి తిరుగుతూ తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. అదేవిధంగా చెత్త సేకరించే ఆటోలు, వాటి నిర్వహణ తీరుపై మున్సిపల్ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీలో సీబీఎం కళాశాల వెనకాల ఉన్న డీఆర్‌సీసీ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. చెత్త సేకరణ తర్వాత డీఆర్‌సీసీలో నిర్వహించే పద్ధతులపై ఆరా తీశారు. అనంతరం కుర్మిద్ద రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న ఎనిమల్ బర్త్ సెంటర్‌ను పరిశీలించి, తీసుకోవాల్సిన పలు అంశాలను కమిషనర్‌కు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్, వార్డు ఆఫీసర్లు, మహిళా సంఘాల సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీడీఎంఏ అసిస్టెంట్ డైరెక్టర్ సాయి

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు



కల్వకుర్తి మండలం ముకురాల గ్రామంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఇబ్రహీం



పెద్దకొత్తపల్లి మండలం దేవునితిర్మాలాపూర్‌లో..



బల్మూర్ మండలం వీరంరాజ్‌పల్లిలో

సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రెవెన్యూ సదస్సులు కొనసాగాయి. కల్వకుర్తి మండలం ముకురాల గ్రామంలో తహసీల్దార్ ఇబ్రహీం హాజరై 33 మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పెద్దకొత్తపల్లి మండలం దేవునితిర్మాలాపూర్ 70 దరఖాస్తులు, వేడుకరావుపల్లిలో 19, బల్మూర్ మండలంలోని తుమ్మెన్‌పేట, వీరంరాజ్‌పల్లి గ్రామాల్లో 20 దరఖాస్తులు, వెల్దండ బైరాపూర్‌లో 46, పోతేపల్లిలో 26 దరఖాస్తులు, కొల్లాపూర్ మండలంలోని ఎన్మన్‌బెట్లలో 86, చింతలపల్లిలో 27 దరఖాస్తులు అందాయి. చారకొండ మండలం సిర్సనగండ్లలో, లింగాల మండలంలోని కొత్తకుంటపల్లి, కోమటికుంట రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.

వెబ్ కౌన్సెలింగ్‌ను వినియోగించుకోండి

కొల్లాపూర్: ఎస్ఎఫ్‌హెచ్‌సీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐఐటీ–జేఈఈ ఎంట్రెన్స్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా వెబ్ కౌన్సెలింగ్‌పై అవగాహన కల్పించనున్నట్లు ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ పుట్టపాగ సంగెమయ్య వెల్లడించారు. 2025 ఐఐటీ–జేఈఈ ఎంట్రెన్స్ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులకు వారు తీసుకోబోయే కోర్సుల ద్వారా భవిష్యత్తులో లభించే ఉపాధి అవకాశాలు, ప్లేస్‌మెంట్స్, ర్యాంకుల ప్రకారం ఎక్కడ సీట్లు లభించొచ్చు, వాటి వివరాలు, వెబ్ కౌన్సిలింగ్‌లో పాల్గొనే విధానం వంటి విషయాలను ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివరించనున్నారు. విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు సెల్ నంబర్: 78927 82387కు వాట్సాప్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. బొంబాయి, వారణాసి, భోపాల్, దుర్గాపూర్, హైదరాబాద్ ఐఐటీ కళాశాలలకు చెందిన ప్రొఫెసర్లు సలహాలు, సూచనలు ఇస్తారని వివరించారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయండి

కొల్లాపూర్ రూరల్: జిల్లా స్థాయి కేవీపీఎస్ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ సంఘం ఉపాధ్యక్షుడు అశోక్ కోరారు. శుక్రవారం మండలంలో రామాపురంలో శిక్షణ తరగతుల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9, 10, తేదీలలో పట్టణంలో సామాజిక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. దళితులపై జరుగుతున్న దాడులు, రాజ్యాంగం ఇచ్చిన హక్కులు, దళిత చట్టాలపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బత్తిని రాజు, సంజీవ్, సురేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాల అందజేత



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యార్థులకు శుక్రవారం ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దేవాలయం ట్రస్ట్ చైర్మన్ జూలూరు రమేష్ బాబు హాజరై మాట్లాడుతూ చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శేఖర్, మౌనిక, తరుణ్, జి శ్రీనివాస్, వీరేష్, డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ

మన్ననూర్: ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు శనివారం అమ్రాబాద్ మండల కేంద్రంలోని ఎంకే ఫంక్షన్‌లో మంజూరు పత్రాలను అందజేయనునట్లు ఎంపీడీఓ లింగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ హాజరవుతారని పేర్కొన్నారు. అధికారులు, లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

లింగాల: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా మత్స్యశాఖ ఏడీ రజని అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు 36 రోజులుగా నిర్వహించిన వేసవి కబడ్డీ శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా ఏడీ హాజరై మాట్లాడారు. క్రీడల్లో మెళకువలు నేర్చుకునేందుకు శిబిరాలు దోహదం చేస్తాయన్నారు. క్రీడాకారుల ప్రతిభ గుర్తించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం డీవైఎస్ఓ సీతారాంనాయక్‌తో కలిసి క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందజేశారు. ముగింపు సందర్భంగా ముదిరాజ్ సమాజ్ ఆధ్వర్యంలో టోర్నమెంట్ నిర్వహించి క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సలేశ్వరం, బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్, కబడ్డీ కోచ్‌లు అబ్దుల్లా, హరీష్‌కుమార్, ప్యారం నవీన్, వాసవీ క్లబ్ అధ్యక్షులు కొత్తరామకృష్ణ, పీడీ వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.



లింగాలలో శిక్షణ పొందిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఏడీ రజని

పీహెచ్‌సీల్లో సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు

బిజినేపల్లి: జిల్లాలోని పీహెచ్‌సీల పరిధిలోని అందరికీ సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తామని డీఎంహెచ్ఓ కేవీ స్వరాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సమగ్ర వ్యాధి నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. శిబిరంలో 127 మందికి 7 రకాల వ్యాధుల నిర్ధారణకు సాధారణ పరీక్షలతో పాటు రక్తపరీక్షలు, మధుమేహం, రక్తపోటు వంటి వివిధ పరీక్షలను చేశారు. అనంతరం డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ వరకు అన్ని పీహెచ్‌సీల్లో 7 రకాల వ్యాధులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయనున్నామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ వెంకటదాస్, వైద్యాధికారి డా.శివకుమార్, ఆరోగ్య విస్తీరణ అధికారి రమేష్‌కుమార్, సిబ్బంది నరసింహ, శివశంకర్, ఎల్ఎస్ రాజ్‌కుమార్, శ్రీను, అశోక్, ఆంజనేయులు, శ్వేత, ఆశాలు పాల్గొన్నారు.



వైద్య పరీక్షల తీరును పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ కేవీ స్వరాజ్యలక్ష్మి

బక్రీద్‌కు ఏర్పాట్లు పూర్తి



కందనూలు: బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్–ఉల్–అజహా కోసం శుక్రవారం జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులోని ఈద్గా వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటలకు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్నట్లు మత పెద్దలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వృద్ధాశ్రమంలో బీజేపీ నాయకుడు గురాల రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి జన్మదినం సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అంతకుముందు మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు దుర్గాప్రసాద్, శేఖర్ రెడ్డి, బాబీదేవ్, నరసింహ, గంగాధర్ ఆచారి తదితరులు ఉన్నారు.

గంగారంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

బిజినేపల్లి: మండలంలోని గంగారంలో శుక్రవారం ఉదయం రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు అనే కార్యక్రమానికి పాలెం ఆర్ఏఆర్ఎస్, కేవీకే శాస్త్రవేత్తలు హాజరయ్యారు. వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు సాగులో అనుసరించే నూతన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. డా.శశిభూషణ్, రమేష్‌కుమార్, ఏఈఓ ఫరీద్‌పాషా, పాఠశాల ఉపాధ్యాయులతో పాటు రైతులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



అచ్చంపేట ఎస్ఐ విజయభాస్కర్

అచ్చంపేట రూరల్: అచ్చంపేట ఎస్ఐగా విజయభాస్కర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన రమేష్ నాగర్‌కర్నూల్ వీఆర్‌కు వెళ్లగా, నాగర్‌కర్నూల్ వీఆర్ నుంచి విజయభాస్కర్ అచ్చంపేటకు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ విజయభాస్కర్ మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడటానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎస్ఐని పలువురు కలిసి స్వాగతం పలికారు.

ఎస్ఐగా మహేష్

వంగూరు: మండల ఎస్ఐగా మహేష్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ మహేందర్ బదిలీపై వెళ్లగా గద్వాలలో పనిచేస్తున్న ఎస్ఐ మహేష్ బదిలీపై మండలానికి వచ్చారు. సిబ్బంది ఆయనకు పూలబొకె ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

బల్మూర్ ఎస్ఐగా రాజేందర్

బల్మూర్: మండల నూతన ఎస్ఐగా రాజేందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ రమాదేవి నాగర్‌కర్నూల్ వీఆర్‌కు బదిలీపై వెళ్లారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌లో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహాపూజ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో వేదపండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు, రుద్ర పారాయణం, ఆవాహిత దేవతా పూజలు, రుద్రాభిషేకం, హోమాలు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. పూజల్లో పాల్గొనే భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేపట్టారు. నాయకుడు సురభి పుల్లారావు పాల్గొన్నారు.

రుణాల చెల్లింపుతోనే ఆర్థిక వృద్ధి



బిజినేపల్లి: రుణాల చెల్లింపుతోనే ఆర్థిక వృద్ధి సాధ్యమని డీఆర్‌డీవో చిన్న ఓబులేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని పాలెంలో శ్రీనిధి రుణాల మొండి బకాయిదారులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలన్నారు. క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తే తద్వారా ఆ సంఘం మరింత ఎక్కువ మొత్తంలో రుణం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం అందించే వడ్డీ రాయితీకి అర్హులవుతారన్నారు. కార్యక్రమంలో శ్రీనిధి రీజినల్ మేనేజర్ మహేంద్రకుమార్, మేనేజర్ విక్రమ్‌కుమార్, సీసీ రామస్వామి, వీఓఏలు, పలు సంఘాల లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ డిజైన్ మార్చాలి

బల్మూర్: ఉమామహేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ప్రస్తుత రూపకల్పనలో (డిజైన్) మార్చాలని శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ ప్రజావాణిలో నిర్వాసితులు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి చెందిన నిర్వాసిత రైతులు సీతారాంరెడ్డి, రఘుమారెడ్డి, కృష్ణయ్యలు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని ప్రజాభవన్‌లో కలిసి సమస్యను విన్నవించారు.

పాఠశాలల యూనిఫాం పంపిణీ

తాడూరు: ఐకేపీ ద్వారా విద్యార్థులకు కుట్టిన దుస్తులను మండలంలోని ఎమ్మార్సీ భవన ఆవరణలో డీఈఓ రమేష్‌కుమార్ పరిశీలించి ఆయా పాఠశాలల హెచ్ఎంలకు పంపిణీ చేశారు. మొత్తం ఏడు పాఠశాలలకు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయులకు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఆయా పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



నాగర్‌కర్నూల్ రూరల్: ప్రజా సమస్యలపై నిరంతర పోరాడుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం బాల్‌నర్సింహ అన్నారు. శుక్రవారం కుమ్మెరలో సీతారాముల అధ్యక్షతన మండల 18వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఏర్పడి వంద సంవత్సరాలు అయ్యిందని ప్రజల పక్షాన ఎన్నో ఉద్యమాలు పోరాటాలు నిర్వహించి పేదలకు భూములు పంపిణీకి కృషి చేశామన్నారు. మహాసభలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్ ఆనంద్‌జీ, వార్ల వెంకటయ్య, జిల్లా సమితి సభ్యులు కృష్ణాజీ, కొమ్ము భరత్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివశంకర్, వెంకటయ్య, శివకృష్ణ, గౌరమ్మ, కాజా, గోపి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

మట్టిని తొలగించాలి

పెద్దకొత్తపల్లి: వడ్లవాని కుంటలో ప్లాట్ల కోసం అక్రమంగా తరలించిన మట్టిని తొలగించాలని కోరుతూ తహసీల్దార్ శ్రీనివాసులకు మత్స్యకార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఎల్లయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామ మత్స్యకార్మిక సంఘం అధ్యక్షులు రామస్వామి, మల్లేష్, ఆంజనేయులు, ఎల్లయ్య, రాములు పాల్గొన్నారు.